క్లుప్తంగా

ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం ఫొటో ఏర్పాటు

కేటీదొడ్డి: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీటీ శివశంకర్, ఎంపీడీఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాలయాల్లో సీఎం ఫొటో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు ఉదయ్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

పుల్లూర్‌లో ప్రజలకు అవగాహన



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామంలో కళాబృందం ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాలు, సైబర్ నేరాలను అరికట్టాలని, గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక కళాకారులు కేశవులు, కవిత, భూపతి నాయుడు, డప్పు కృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఎంపీడీఓ తిరుపతన్న సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలు, కార్మికుల జీతాలు, ఎల్‌ఆర్‌ఎస్ ప్రగతి నివేదిక, మహాలక్ష్మి గ్యాస్ పథకం పత్రాల పంపిణీపై ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో తప్పిన తిప్పలు



అయిజ: మండలంలోని పులికల్ గ్రామంలో ఎస్సీ కాలనీలో విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో కొంత కాలంగా ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ అధికారులు మంగళవారం 25 కేవీ సామర్థ్యంగల నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో విద్యుత్ సమస్యలు తొలగడంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

డిజిటల్ కార్డులపై ఆందోళన వద్దు

రాజోళి: డిజిటల్ కార్డులపై ఆందోళన చెందవద్దని తహసీల్దార్ పి.రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ కార్డులు వస్తున్నాయంటూ, మీ సేవ కేంద్రాలు, నెట్ సెంటర్ల చుట్టూ తిరగవద్దని, అనవసరంగా డబ్బు వృథా చేసుకోవద్దని ఆయన మండల ప్రజలకు సూచించారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే అధికారికంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రజలకు సమాచారం అందిస్తామని, అప్పటి దాకా ప్రజలు అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిరగవద్దని ఆయన తెలిపారు.

రాకపోకలకు ఇబ్బందులు



ఉండవెల్లి: మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్న సందర్భంగా గల్లీరోడ్లకు దారిని మళ్లించి వాహనాలు ప్రయాణిస్తున్నాయి. 10 రోజుల నుంచి రోడ్డు పనులు జరుగుతున్న తరుణంలో జాతీయ రహదారికి వెళ్లే మార్గాన్ని మళ్లించారు. రోడ్డును త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని వాహనదారులు కోరుతున్నారు.



అయిజలో కాళికాదేవి ఆలయంలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు



అయిజలో గుంతరామలింగేశ్వర ఆలయంలో..



అయిజలో గజ వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వర స్వామి



ప్రాగటూరులో లక్ష్మీదేవిగా..



మల్దకల్‌లో రాజరాజేశ్వరిదేవి అలంకరణలో వాసవీమాత



గట్టులో మహాలక్ష్మీదేవిగా..

మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు



రాజోళిలో..



శాంతినగర్‌లో అమ్మవారి లలితసహస్రనామాలు పఠిస్తున్న మహిళలు

- వివిధ ఆలయాల్లో పలు రకాల రూపాల్లో భక్తులకు దర్శనం
- గజ వాహనంపై ఊరేగిన అమ్మవారు

సాక్షి, నెట్‌వర్క్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అయిజ కాళికాదేవి, గుంతరామలింగేశ్వరస్వామి ఆలయాల్లో పూజలందుకున్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. కట్టమిది తిమ్మప్ప ఆలయంలో గజవాహనంపై ఊరేగించారు. మానవపాడు మండలంలోని చెన్నిపాడులో నృత్యాలు, కోలాటాలతో అలరించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులు పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాజోళి మండల కేంద్రంలో భక్తులు కుంకుమార్చన చేశారు. ఉండవెల్లి, కంచుపాడు, ప్రాగటూరులో రూ.50,516లతో లక్ష్మీదేవి అలంకరణ చేశారు. మల్దకల్ కన్యకా పరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గట్టులో భవాని మాత మహాలక్ష్మీదేవిగా పూజలందుకున్నారు.



బీచుపల్లిలో అన్నపూర్ణాదేవిగా..

- ధరూరులోని కాళికాదేవి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.
- ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.ఎర్రవల్లి శివాంజనేయస్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా పూజలందుకున్నారు.



ధరూర్‌లో..



ఎర్రవల్లిలో..

కొనసాగుతున్న పాదయాత్ర



అయిజ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రిటైర్డ్ డీఈఓ డాక్టర్ శివార్చక విజయ్‌కుమార్ గాంధీ జయంతి రోజున చేపట్టిన 'బాపు బాటలో సత్యశోధన' పాదయాత్ర మంగళవారం మండలంలోని చిన్న తాండ్రపాడుకు చేరింది. ఈ సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి పాదయాత్రను కొనసాగించారు. వంద రోజుల్లో వెయ్యి కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేస్తానని తెలిపారు. పాదయాత్రలో వివిధ రకాల మనుషులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుధాకర్‌గౌడ్, లక్ష్మన్న, రవీంద్ర దీర, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి అభినందనలు

అయిజ: మున్సిపాలిటీలోని అక్షర 'బీసీ (బీ)' క్యాటగిరి లో జనగామ జిల్లాలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించడంతో మంగళవారం పట్టణంలోని పలువురు వ్యక్తులు ఆమెను అభినందించారు. ఈసందర్భంగా అక్షర మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టం విలువ తెలుసుకొని లక్ష్యాన్ని సాధించానన్నారు. తల్లిదండ్రులకు, విద్యను నేర్పించిన గురువులకు మంచిపేరు తెస్తానని పేర్కొన్నారు.

నీలిపల్లిలో జములమ్మ విగ్రహ ప్రతిష్ఠ



మల్దకల్: మండలంలోని నీలిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో జములమ్మ, పరశురామస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మంగళవారం గ్రామంలోని ఆలయ ఆవరణలో జములమ్మ, పరశురాముడిల విగ్రహాలకు వేదపండితులు రమేషాచారి, దీరేంద్రదాసు, నాగరాజు శర్మలు హోమం, పూజలు నిర్వహించారు. అంతకు ముందు విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

సామాజిక తనిఖీ



అలంపూర్ రూరల్: అలంపూర్ మండలంలో ఉపాధి హామీ పథకంలో 2023–24 సంవత్సరంలో చేసిన పనులపై మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య దగ్గర ప్రజా వేదిక నిర్వహించారు. గుర్తించిన అంశాలపై ప్రిసైడింగ్ అధికారి రూ.21వేల జరిమానా, రూ.65,230 రికవరీ విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నర్సింగ్‌రావ్, అంబుడ్స్‌మెన్ పర్సన్ జమ్మన్న పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మల్దకల్/ఎర్రవల్లి/గట్టు: గ్రామాల్లో 18ఏళ్లలోపు బాలికలకు బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని బాలల పరిరక్షణ సమితి విభాగం కౌన్సిలర్ సురేష్ అన్నారు. మండలంలోని కుర్తిరావల్‌చెర్వులో బాలల పరిరక్షణ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుమలేష్, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీదేవి, ఏలీషమ్మ పాల్గొన్నారు.



చాగాపురంలో బాలల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పరమేశ్వరి హాజరై బాలల చట్టాలతో పాటు వారి సమస్యలు, వారి పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం బాలల సంరక్షణ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సరోజ, చిట్టెమ్మ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు, మహిళలు, తదితరులు ఉన్నారు.
- చదువు ఉద్యోగం కోసం కాదని, జ్ఞానం కోసమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్యారాణి, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటక్షన్ యూనిట్ ఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి తెలిపారు. గంగిమాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామ స్థాయి బాలల సంరక్షణ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. సమాజంలో పిల్లలను, మహిళలను కాపాడుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ జ్యోతి, కార్యదర్శి దస్తగిరి, వీసీపీసీ సభ్యులు పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

మానవపాడు: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం 2వ రోజు మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏఈఈ రాఘవేంద్ర ఆధ్వర్యంలో హ్యాండ్ పంపులపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం గ్రామ పంచాయతీల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆయా గ్రామాల మంచినీటి సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



రెండోరోజు శిక్షణలో సహాయకులు

ఒక్కేసి పువ్వేసి చందమామ..



ఎర్రవల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు.

గట్టు: మండల పరిధిలోని ఆలూరులో ఇందువాసి సెక్టార్‌కు సంబంధించి ఇందువాసి, బోయలగూడెం, లింగాపురం, రాయాపురం, తారాపురం, వాయిల్‌కుంటతండా, బింగిదొడ్డి తండాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు ఆలూరులో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి, ఆయా గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని 11వార్డులో కాలనీ వాసులు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. చిన్నారులు, మహిళలు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

అల్వలపాడులో..

ధరూరు: మండలంలోని అల్వలపాడులో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మహిళలు పుర వీధుల గుండా ట్రాక్టర్‌లో భారీ బతుకమ్మను ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు ప్రతాప్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



అల్వలపాడులో భారీ బతుకమ్మ



ఆలూరులో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



గద్వాల పట్టణంలో బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న మహిళలు

మంత్రికి సమస్యల వెల్లువ

అలంపూర్: అలంపూర్ క్షేత్రాన్ని అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి పలువురు వినతి పత్రాలు అందజేశారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు కోట నరసింహులు ఆధ్వర్యంలో నేతన్నలు వినతిపత్రం అందజేశారు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా కేంద్రానికి సమీపంలో నేతన్నల అభివృద్ధికి 50 ఎకరాల భూమిని హ్యాండ్లూమ్ పార్క్‌గా ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఆ పార్కు ఇప్పటికి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడం రామకృష్ణ, టీపీసీసీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు చిన్ని నాగరాజు ఉన్నారు.

ఆలయ భూములను రక్షించండి

ఉండవెల్లి మండలం బొంకూరులో శ్రీరామలింగేశ్వర స్వామి, పెద్దమ్మ, ఆంజనేయస్వామి, కేశవస్వామి దేవాలయాల భూములు రక్షించాలని కన్యధార శాంతి మంత్రికి వినతిపత్రం అందజేశారు.

వేతనాలు విడుదల చేయాలని వినతి



ఎర్రవల్లి: పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ వర్కర్ల వేతనాలు వెంటనే విడుదల చేయాలని మంగళవారం ఇటిక్యాల ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్‌కు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తిక్ మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా గ్రామ పంచాయతీ వర్కర్లకు వేతనాలు అందడం లేదన్నారు. కార్యక్రమంలో హరీష్, మధు, వెంకట్రామిరెడ్డి, రాజు, బీచుపల్లి ఉన్నారు.

ఏటీఎం అద్దాలు ధ్వంసం

అమరచింత: పట్టణంలోని ఇండియా నెంబర్ 1 ఏటీఎం అద్దాలను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. మంగళవారం తెల్లవారు జామున ఏటీఎంపై రాళ్లతో దాడి చేసి అక్కడి నుంచి వెళ్లి పోయారు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయక పోవడంతో ఇలాంటి సంఘటన జరిగిందని స్థానికులు తెలిపారు. ఏటీఎం నిర్వాహకులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



అలంపూర్: కర్నూల్లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే విజయుడు మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. వడ్డేపల్లి మండలం తనగల గ్రామానికి చెందిన నాగేంద్రప్పకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.60 వేల చెక్కు వచ్చినట్లు తెలిపారు. నాగేశ్వర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, భీమేష్, వీరన్న తదితరులు ఉన్నారు.

తనగలలో వైద్య శిబిరం



శాంతినగర్: వడ్డేపల్లి మండలం తనగలలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ఎంబీ చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో గ్రామస్తులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత పరీక్షలు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, తనగల సంఘ కాపరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



అయిజ: హరియాణలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో భీమసేన రావు, వెంకటేష్, లక్ష్మణ్ గౌడ్, ప్రదీప్ కుమార్, భగత్ రెడ్డి, రఘు, రాజశేఖర్, వీరేష్ గౌడ్, నరసింహ, రాఘవ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గద్వాలటౌన్: 18 సంవత్సరాల తర్వాత 2006–07 పదో తరగతి విద్యార్థులు మంగళవారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. చిన్ననాటి మిత్రుడు జగదీష్ అకాల మరణం చెందటంతో, ఆయన పిల్లల చదువుల నిమిత్తం రూ.50 వేల నగదు అందజేశారు. సమ్మేళనాన్ని పురస్కరించుకుని పూర్వ విద్యార్థులు పాఠశాలకు సీసీ టీవీ కెమెరా కొనుగోలు కోసం రూ.70వేల నగదు పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు.